క్లుప్తంగా

ఆలయానికి రూ.30 వేలు విరాళం



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మవారికి సోమవారం నందిగామ మండలం రామిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన పోపూరి రాధాకృష్ణ, రాజేశ్వరి దంపతుల కుమార్తె త్రివేణి రూ.30వేలను విరాళంగా ఆలయ అధికారి కృష్ణమోహన్‌కు అందజేశారు. ఈసందర్భంగా త్రివేణి మాట్లాడుతూ తన మొదటి నెల జీతాన్ని అమ్మవారికి అందించినట్లు తెలిపారు. విరాళం నగదులో రూ.15వేలు ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి, మరో రూ.15వేలు గోశాలలో గోవుల సంరక్షణకు వినియోగించాలని ఆమె కోరారు. ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

విద్యార్థులకు బ్యాగులు, గొడుగుల పంపిణీ



పెనుగంచిప్రోలు: స్థానిక తుఫాన్ కాలనీలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ముత్తూట్ మినీ ఫైనాన్స్ పెనుగంచిప్రోలుశాఖ వారు సోమవారం స్కూల్ బ్యాగ్‌లు, గొడుగులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా సర్పంచ్ వేల్పుల పద్మకుమారి మాట్లాడుతూ సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ హర్ష సాయి, ఎంఈవో డి రవీంద్ర, ముత్తూట్ మినీ ఫైనాన్స్ స్టేట్ హెడ్ కె.కన్నబాబు, జోనల్ మేనేజర్ నిరంజన్‌కుమార్, బ్రాంచ్ మేనేజర్ ఎస్.వీరాస్వామి, రీజనల్ మేనేజర్ శంకర్, హెచ్ఎం.ప్రభావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలకు విరాళం



మక్కపేట(వత్సవాయి): అజ్మీరు వీరభద్రయ్య–తులశమ్మ చారిటబుల్ ట్రస్టు ద్వారా ట్రస్టు సభ్యులు రామావత్ జయశ్రీ, బాణావతు లక్ష్మీదుర్గ, అజ్మీరు జయప్రకాష్ కలిసి మక్కపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రూ.పదివేల విరాళాన్ని అందజేశారు. ఈ మేరకు నగదును పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు చేతుల మీదుగా ప్రధానోపాధ్యాయుడు చిత్రాల వెంకటేశ్వరరావుకు సోమవారం అందజేశారు.

పాఠశాల అభివృద్ధి తమవంతుగా కృషిచేస్తామని, భవిష్యత్‌లో కూడా సహకారం అందిస్తామని ట్రస్ట్ సభ్యులు తెలుపగా, వారిని ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వరరావు అభినందించారు.

భక్తిశ్రద్ధలతో చండీహోమం



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మవారి ఆలయంలోని యాగశాలలో సోమవారం వేద పండితులు గోపాలకృష్ణశర్మ ఆధ్వర్యంలో చండీహోమం నిర్వహించారు. ఈసందర్భంగా సకల సుఖాలు కలగాలని ఈహోమం నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రహదారికి మరమ్మతులు

యథావిధిగా రాకపోకలు



వీరులపాడు: ఇటీవల కురిసిన వర్షాలకు తోడు ఎగువ నుంచి వచ్చిన భారీ వరద కారణంగా పల్లెంపల్లి సమీపంలోని వైరా కట్టలేరు వద్ద చప్టాకు పడిన గుంతలను ఆర్‌అండ్‌బీ అధికారులు పూడ్చివేయించారు. దీంతో వాహనాల రాకపోకలు ప్రారంభమయ్యాయని తహసీల్దార్ రాజకిషోర్ తెలిపారు. చప్టాకు చేపట్టిన మరమ్మతులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజలకు రాకపోకలను అనుమతిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా ఈ మార్గం గుండా రాకపోకలు సాగించే వాహనదారులు రాత్రి సమయంలో జాగ్రత్తగా వెళ్లాలని సూచించారు. తహసీల్దార్ వెంట ఆయా గ్రామాల వీఆర్వోలు ఉన్నారు.

ఎత్తిపోతల నుంచి నీటి విడుదల



ఎత్తిపోతల పథకం నుంచి నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య



యూటీఎఫ్ ప్యానల్ డైరెక్టర్లను అభినందిస్తున్న ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య

పోలంపల్లి(వత్సవాయి): పోలంపల్లి వద్ద మునేటి సమీపంలో నిర్మించిన పోలంపల్లి, పెంట్యాలవారిగూడెం ఎత్తిపోతల పథకం నుంచి ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) సోమవారం నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తాతయ్య మాట్లాడుతూ ఈ పథకం ద్వారా వత్సవాయి మండలంతోపాటు తెలంగాణ రాష్ట్రంలోని చింతకాని, బోనకల్లు మండలాలకు చెందిన సుమారు 3వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. రైతులు కూడా సాగునీటిని వృథా చేయకుండా దిగువ భూములకు కూడా నీరందేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఎత్తిపోతల పథకం చైర్మన్ పెంట్యాల వెంకటేశ్వరరావు, మండల టీడీపీ అధ్యక్షులు వడ్లమూడి రాంబాబు, సీపీఎం జిల్లా పార్టీ నాయకులు చిరుమామిళ్ల హనుమంతురావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసి యూటీఎఫ్ ప్యానల్ డైరెక్టర్లు ..

జగ్గయ్యపేట అర్బన్:టీచర్స్ కోపరేటివ్ సొసైటీ ఎన్నికల్లో యూటీఎఫ్ ప్యానల్ తరపున డైరెక్టర్లుగా ఎన్నికైన వారిని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) అభినందించారు. ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా సొసైటీ ఎన్నికల్లో గెలిచిన యూటీఎఫ్ ప్యానల్ డైరెక్టర్లు ఎం.కృష్ణయ్య, సీహెచ్ఎస్ఎన్ మూర్తి, అల్లిక నరసింహారావు, అజ్మీరు శ్రీను, సయ్యద్ రషీద సోమవారం జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్యను కలిశారు. ఎమ్మెల్యే తాతయ్య వారిని అభినందించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి, వారి సంక్షేమానికి సొసైటీ సభ్యులు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

అనాథ ప్రాణం కాపాడిన పోలీసులు



అనాథ వ్యక్తిని ప్రభుత్వాస్పత్రికి తరలిస్తున్న ఎస్ఐలు సూర్యభగవాన్, పద్మారావు, సిబ్బంది

జగ్గయ్యపేటఅర్బన్: జగ్గయ్యపేట పట్టణ పోలీసులు ఓ అనాథ వ్యక్తిని సకాలంలో వైద్యశాలకు తరలించి అతన్ని ప్రాణాలను కాపాడారు. వివరాల్లోకి వెళితే..

పట్టణ సమీపంలోని ఆటోనగర్‌లో ఓ వ్యక్తి చనిపోయి ఉన్నాడని సోమవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందింది. దీంతో పట్టణ ఎస్ఐలు సూర్యభగవాన్, పద్మారావు వెంటనే అక్కడకు వెళ్లి పరిశీలించగా, ఓషాపు ఆవరణలో గోడ అవతల ఓవ్యక్తి దుస్తులు లేకుండా కొన ఊపిరితో పడి ఉన్నాడు. కదలలేని స్థితిలో ఉన్న అతను పక్షవాతంతో ఉన్నాడని గుర్తించారు. వెంటనే గోడదూకి అవతలకు వెళ్లి అతనికి ప్రాథమిక చికిత్స చేశారు. మెరుగైన వైద్యం కోసం అంబులెన్స్‌ను పిలిపించి స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించి వైద్య సేవలందేలా చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం బాధితుని ఆరోగ్య పరిస్థితి బాగానే ఉన్నట్లు ఎస్ఐలు సూర్యభగవాన్, పద్మారావు తెలిపారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతుండటంతో ఎస్ఐలు సూర్యభగవాన్, పద్మారావు, పోలీసు సిబ్బంది సేవలను అందరూ ప్రశంసిస్తున్నారు. శభాష్ జగ్గయ్యపేట పోలీస్ అంటూ వారి సేవలను కొనియాడుతున్నారు.

25 టన్నుల ఇసుక స్వాధీనం



జగ్గయ్యపేట: పట్టణ సమీపంలోని ఆటోనగర్ ఇండస్ట్రియల్ పార్కులో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంప్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్ నాగరాజు సోమవారం తెలిపారు. ఆటోనగర్‌లోని పలు ప్రాంతాలలో అక్రమంగా ఇసుక డంప్ చేశారని సమాచారం అందడంతో ఆర్ఐ ఆనంద్ ఆధ్వర్యంలో వీఆర్వోలు డంప్‌ను పరిశీలించి స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న ఇసుక 25 టన్నుల వరకు ఉంటుందన్నారు. అనంతరం జేసీబీ ద్వారా ఇసుకను లారీలోకి ఎత్తి రెవెన్యూ కార్యాలయానికి తరలించినట్లు తహసీల్దార్ తెలిపారు.

అన్నదానం భక్తులకా...అధికారులకా?



ఆలయ అధికారులు, సిబ్బందికి క్యారేజీల ద్వారా భోజనం తీసుకెళ్తున్న పారిశుద్ధ్య కార్మికులు

పెనుగంచిప్రోలు: దూరప్రాంతాల నుంచి అమ్మవారి దర్శనం కోసం వచ్చే భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమం నుంచి ఆలయ అధికారులు క్యారేజీలు తెప్పించుకుంటున్న వైనంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వివరాల్లోకి వెళితే..పెనుగంచిప్రోలులోని తిరుపతమ్మ ఆలయంలో భక్తుల సౌకర్యార్థం అన్నదానం చేస్తుండగా, ఆలయంలో పనిచేసే కొందరు అధికారులు పారిశుద్ధ్య కార్మికుల ద్వారా నిత్యం క్యారేజీలు తెప్పించుకుంటూ భోజనాలు చేస్తున్నారు. స్థానికుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నా సదరు అధికారులు పట్టించుకోకపోతుండటంపై ఆలయ ధర్మకర్త బెజవాడ శ్రీనివాసరావు మండిపడ్డారు. ఆలయ అధికారులు ఇలా చేయడం తగదని, ఈ విషయంపై ఆలయ ఈవో దృష్టికి తీసుకుళ్తానని ఆయన తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా ఈవో తగిన చర్యలు తీసుకోవాలని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు.

తహసీల్దార్‌కు ఫిర్యాదు



వీరులపాడు: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. తమ కుటుంబానికి మంచినీటి కొళాయి కనెక్షన్ ఇవ్వకుండా పంచాయతీ అధికారులు తమను ఇబ్బంది పెడుతున్నారంటూ జుజ్జూరుకు చెందిన బాణావత్ కోటేశ్వరరావు తహసీల్దార్ రాజకిషోర్‌కు ఫిర్యాదు చేశారు. తనకు మంచినీటి కొళాయి కనెక్షన్ ఇప్పించాలని ఈమేరకు ఓ వినతిపత్రం అందజేశారు. అనంతరం తహసీల్దార్ రాజకిశోర్ మాట్లాడుతూ ఈ అర్జీని మండలపరిషత్‌కార్యాలయ పాలనాధికారికి పంపించినట్లు తెలిపారు. త్వరలోనే సమస్య పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నిరసన



కంచికచర్ల ఎంఈవో బాలాజీకి వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు



పెనుగంచిప్రోలులో వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

కంచికచర్ల : జీవో నంబర్ 117తో పనిసర్దుబాటు చేయడం విద్యారంగాన్ని వినాశనం చేయడమే అవుతుందని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు వేముల భిక్షమయ్య అన్నారు. గతంలో యువగళం పాదయాత్రలో నేటి విద్యాశాఖమంత్రి లోకేష్ ఇచ్చిన హామీ మేరకు వెంటనే జీవోనంబరు 117ను రద్దుచేయాలని ఆయన డిమాండ్ చేశారు. పదోన్నతులు కల్పించిన తర్వాతే పని సర్దుబాటు చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక మండల వనరుల కేంద్ర కార్యాలయంలో వద్ద సోమవారం ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు నిరసన ప్రదర్శన చేశారు. అనంతరం తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఎంఈవో బి.బాలాజీకి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా భిక్షమయ్య మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని విద్యాశాఖమంత్రి లోకేష్ అమలు చేయకుండా, వెనకడుగు వేస్తున్నారన్నారు. మూడు నుంచి ఐదు తరగతులను జెడ్పీ పాఠశాలలో విలీనం చేస్తే ప్రాథమిక పాఠశాలలు నిర్వీర్యమవుతాయన్నారు. తక్షణమే ఆ జీవోను రద్దు చేసి, పనిసర్దుబాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ఎస్టీయూ సంఘ నాయకులు నండ్రు సురేష్‌బాబు, విక్టర్, ఏపీటీఎఫ్ నాయకులు ప్రభు కిషోర్, యూటీఎఫ్ నాయకులు ఫణీంద్ర, నాగేశ్వరరావు, రామారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలు మండలంలో...


పెనుగంచిప్రోలు: పని సర్దుబాటు ప్రక్రియలో ఉపాధ్యాయ సంఘాల సూచనలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు వారు సోమవారం పెనుగంచిప్రోలు మండల వనరుల కేంద్రం సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఉపాధ్యాయ సంఘాల నాయకులు మాట్లాడుతూ జీవోనంబరు 117, 128 ద్వారా కాకుండా 2020లో విడుదల చేసిన జీవో నంబర్ 53 ద్వారా పని సర్దుబాటు చేయాలని డిమాండ్ చేశారు. పని సర్దుబాటు ప్రక్రియ మండల, డివిజన్ స్థాయికే పరిమితం చేయాలన్నారు. 70 శాతం పైబడి అంగవైకల్యం ఉన్న ఉపాధ్యాయులకు పని సర్దుబాటు ప్రక్రియ నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు. 6నుంచి 10వ తరగతుల్లో 10 సెక్షన్లు దాటితే 2వ హిందీ, 2వ పీఎస్ పోస్టులు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఎండి జిలానీ, ఎస్ రాము, ఎస్‌కె ఖాజా, ఆర్.కొండలరావు, వి.రమణ, పాము నాగేశ్వరరావు, ప్రైమర్, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు



చందాపురం(నందిగామటౌన్): విద్యార్థులు కంటి విషయంలో జాగ్రత్తలు పాటించాలని కంటి వైద్యాధికారి శేషుకుమారి సూచించారు. మండలంలోని చందాపురం ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు నందిగామ ప్రభుత్వాస్పత్రి ఆధ్వర్యంలో సోమవారం కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శేషుకుమారి మాట్లాడుతూ శరీర భాగాలలో కళ్లు అత్యంత సున్నితమైనవన్నారు. కళ్ల విషయంలో అశ్రద్ధచూపవద్దన్నారు. కంటికి సంబంధించి ఏదైనా ఇబ్బందిగా అనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. వైద్యపరీక్షల అనంతరం అవసరమైన వారికి మందులు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నైపుణ్యాలకు పదునుతో ఉపాధి అవకాశాలు



మాట్లాడుతున్న గీతారాజపుత్

పడమట(విజయవాడపశ్చిమ): విద్యార్థులు తమలోని నైపుణ్యాలకు పదును పెడితే మంచి ఉపాధి అవకాశాలను పొందుతారని హిందూజ గ్లోబల్ సొల్యూషన్స్ ఆపరేషన్స్ ఇండియా జనరల్ మేనేజర్ గీతా రాజపుత్ అన్నారు. కేబీఎన్ కళాశాల కంప్యూటర్స్ విభాగం, ప్లేస్‌మెంట్ సెల్ సంయుక్త ఆధ్వర్యంలో కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ నాస్కామ్ సౌజన్యంతో కెరీర్ గైడెన్స్‌పై సదస్సు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యవక్తగా హాజరైన గీతారాజపుత్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా విస్తృత ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని చెప్పారు. ప్రధానంగా కంప్యూటర్స్, డేటా అనలిటిక్స్, క్లౌడ్ కంప్యూటింగ్, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ వంటి రంగాల్లో మంచి ఉపాధి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. అయితే వాటికి సంబంధించి నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. ఆయా నైపుణ్యాలకు సంబంధించి నాస్కామ్ పలు కోర్సులను అందిస్తుందని పేర్కొన్నారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయా కోర్సులను పూర్తి చేసి నాస్కామ్‌లో నమోదు చేసుకున్న వారికి ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. నాస్కామ్ ఏపీ, టీఎస్ రాష్ట్రాల రీజనల్ లీడ్ (అకాడమిక్) బి.ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు తమలోని ప్రత్యేకతలను గుర్తించాలని సూచించారు. వాటికి పదును పెట్టాలన్నారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి.నారాయణరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి, విభాగాధిపతి పి.రవీంద్ర, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

పంటల పరిశీలన



ఆళ్లూరుపాడు/ వేమవరం(వత్సవాయి): పంటలలో వచ్చే తెగుళ్ల విషయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని కేవీకే ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ ఎస్.కృష్ణంరాజు సూచించారు. మండలంలోని ఆళ్లూరుపాడు, వేమవరం గ్రామాలలోని పత్తి, మిరప, పసుపు పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పసుపు పంటలో వచ్చే తెగుళ్లు, పత్తిలో ఎండుతెగులు, వీటి నివారణకు చేపట్టాల్సిన అంశాలను రైతులకు వివరించారు. అధిక తేమ కారణంగా ఎర్రబారిన పత్తి పంటను సందర్శించి రైతులకు తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో, ఆళ్లూరుపాడు సర్పంచి యలమర్తి నరేంద్ర, వ్యవసాయ శాస్త్రవేత్తలు కె.లక్ష్మీకళ, ఎన్.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

క్షతగాత్రుడికి సీపీఎం నాయకుల పరామర్శ



క్షతగాత్రుడు చిన్న కొమ్ములగౌడ్‌ను పరామర్శిస్తున్న డీవీ కృష్ణ

కంచికచర్ల : పరిటాల పవన్ క్రషర్‌లో పనిచేస్తూ తీవ్రగాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కార్మికుడికి కార్పొరేట్ ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డివి కృష్ణ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. తీవ్రంగా గాయపడి విజయవాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కార్మికుడిని సీపీఎం జిల్లా నాయకులు సోమవారం పరామర్శించారు. ఒడిశా రాష్ట్రానికి చెందిన చిన్నకొమ్ముల గౌడ్ ఐదేళ్లుగా క్రషర్‌లో పని చేస్తుండగా, రెండురోజుల కిందట జరిగిన ప్రమాదంలో అతని రెండు కాళ్లు విరిగిపోయాయని డీవీ కృష్ణ తెలిపారు. శస్త్రచికిత్స చేసినప్పటికీ కార్మికుడిని ప్రత్యేక గదిలో ఉంచి మరింత మెరుగైన వైద్యం అందించాలని, లేనిపక్షంలో క్రషర్ ఎదుట ఆందోళన చేస్తామని హెచ్చరించారు. గతనెలలో ఇదే క్రషర్ యజమాని చింతల రామ్మోహనరావుకు చెందిన మెటల్ క్వారీలో ప్రమాదవశాత్తు పెద్దపెద్ద బండ రాళ్లు పడి కార్మికులు మృతిచెందినప్పటికీ వారికి ప్రభుత్వం ప్రకటించిన సరైన నష్టపరిహారం చెల్లించలేదని గుర్తుచేశారు. కార్మికుల భద్రతకు పటిష్ట చర్యలు తీసుకోవడంతోపాటు వారికి పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం కూడా క్వారీ, క్రషర్‌లలో కూడా భద్రతా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. క్షతగాత్రుడిని పరామర్శించినవారిలో ఆపార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సీహెచ్‌ఈ శ్రీనివాస్, ఈ. సురేష్ తదితరులు ఉన్నారు.

మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి



గండేపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఉపాధ్యాయులు

కంచికచర్ల: మత్తుపదార్థాలకు విద్యార్థులు, యువత దూరంగా ఉండాలని గండేపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణ సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం డ్రగ్స్ ఫ్రీ ఇండియా క్యాంపెయిన్ నిర్వహించారు. తొలుత డ్రగ్స్‌కు దూరంగా ఉంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈసందర్భంగా హెచ్ఎం రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు మత్తుపదార్థాలకు అలవాటు పడితే జీవితాలు నాశనమవుతాయన్నారు. డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతిఒక్కరూ కృషిచేయాలన్నారు. దేశభవిష్యత్, సమాజాభివృద్ధిలో యువత ఎంతో కీలకమన్నారు. మత్తుపదార్థాలకు దూరంగా ఉంటేనే యువత అన్నిరంగాల్లో రాణించగలదని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, మహిళాపోలీస్ రాణి, గ్రామ పంచాయతీ కార్యదర్శి జిల్లేపల్లి రత్నాకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

టీచర్స్ కోపరేటివ్ సొసైటీ అధ్యక్షుడిగా కృష్ణయ్య



ఎం.కృష్ణయ్య



సీహెచ్ఎస్ఎన్.మూర్తి



అజ్మీరు శ్రీను

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట, వత్సవాయి మండలాల టీచర్స్ కోపరేటివ్ సొసైటీ చైర్మన్‌గా ఎం.కృష్ణయ్య, ఉపాధ్యక్షుడుగా సీహెచ్ఎస్ఎన్.మూర్తి, కార్యదర్శిగా అజ్మీరు శ్రీను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జగ్గయ్యపేటలోని టీచర్స్ కోపరేటివ్ సొసైటీ బిల్డింగ్‌లో ఎన్నికల అధికారి జె.వేణుగోపాల్ సమక్షంలో సోమవారం కార్యవర్గ ఎన్నిక జరిగింది. అధ్యక్ష, ఉపాధ్యక్ష, కార్యదర్శి పదవులకు ఒక్కొక్క నామినేషన్ మాత్రమే దాఖలు కావడంతో వారు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి వేణుగోపాల్ ప్రకటించారు.

ఎంపీడీవో విశ్వనాథ్ బదిలీ



ఎంపీడీవో విశ్వనాథ్‌ను సత్కరిస్తున్న ఎంపీపీ హనుమంతరావు, సర్పంచులు, కార్యదర్శులు

నందిగామటౌన్: ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సాధారణమని ఎక్కడ పనిచేసినా మంచి పేరు తెచ్చుకునేలా పని చేయాలని ఇన్‌చార్జ్ ఎంపీపీ ఆకుల హనుమంతరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బదిలీపై వెళ్తున్న ఎంపీడీవో విశ్వనాథ్‌ను సోమవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఎంపీడీవోగా విశ్వనాథ్ అందించిన సేవలు మరువలేనివన్నారు. ఆయన బదిలీపై వెళ్తున్నందుకు ఒకింత బాధగా ఉందన్నారు. ఎక్కడకు వెళ్లి ప్రజలకు మంచి చేసే అధికారిగా పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏవో రాఘవశర్మ, ఈవోపీఆర్డీ పద్మజ్యోతి, సీనియర్ అసిస్టెంట్ నాగలక్ష్మి, జూనియర్ అసిస్టెంట్ మనీషా, సర్పంచులు చెరుకూరు హైమారావు, కృష్ణ, కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

పెరుగుతున్న సుబాబుల్ సాగు



వత్సవాయిలో ఇటీవల నాటిన సుబాబుల్ మొక్కలు

వత్సవాయి : అతివృష్టి, అనావృష్టిలతో ఎప్పుడూ నష్టపోతున్న రైతుకు వ్యవసాయం చేయాలంటే పెనుసవాలుగా మారింది. రానున్న కాలంలో వ్యవసాయం చేయాలంటేనే భయపడే రోజులు దగ్గరలోనే ఉన్నాయని రైతన్నలు వాపోతున్నారు. అన్నింటికి తట్టుకుని అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి తీరా పంట చేతికి వచ్చే సమయానికి వస్తున్న తుఫాన్లు కానీ వైరస్‌ల ధాటికి పెట్టిన పెట్టుబడి కూడా తిరిగిరాక రైతులు అప్పులు పాలవుతున్నారు. పంటకు ధర ఉన్న సమయాన పంట పండదు. పంట పండితే ధర లేని పరిస్థితులు తలెత్తున్నాయి. అందుకే కొందరు రైతులు పెట్టుబడితో పనిలేని సుబాబుల్ పంటపై ఆసక్తి కనబరుస్తున్నారు. ఒక్కసారి నాటితే మూడేళ్ల పాటు తిరిగి చూసే పనిలేదు. అతివృష్టి, అనావృష్టిని తట్టుకుని రైతుకు నికరంగా ఆదాయం వస్తుండడమే ఇందుకు కారణం. ప్రస్తుతం ఎకరం సుబాబుల్ కర్ర రూ.లక్ష వరకు పలుకుతోంది. మూడు ఏళ్లకు ఎకరానికి రూ 20 వేలు కూడా ఖర్చు ఉండకపోవడంతో భూములు ఎక్కువ ఉన్న రైతులతోపాటు కొద్దిపాటి భూములు ఉన్న వాళ్లు కూడా సుబాబుల్ సాగుపై ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటివరకు మండలంలో సుమారు 1000 ఎకరాల వరకు సుబాబుల్ సాగు చేపట్టారు. ఈసాగు విస్తీర్ణం మరింత పెరిగే అవకాశం ఉందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

ప్రమాదకరంగా మారిన గుంత



ముచ్చింతాల(పెనుగంచిప్రోలు): మండల కేంద్రం పెనుగంచిప్రోలు నుంచి ముచ్చింతాల వెళ్లే రహదారి మధ్యలో పెద్ద గుంత ఏర్పడింది. వాహనదారులు ఏమాత్రం ఆదమరిచినా ప్రమాదాల బారినపడక తప్పదు. దీంతో స్థానికులు ఈ గుంత కారణంగా ప్రమాదం పొంచి ఉందనే సమాచారం వాహనదారులకు తెలిసేలా అక్కడ ఎర్రటి వస్త్రం కట్టిన ఓ కర్రను ఏర్పాటు చేశారు. ఇకనైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి గుంతను పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు.